ఘనంగా మువ్వాధారణ మహోత్సవం

నిజాంపేట్‌: శ్రీ వేంకట శివ రామాలయంలో మంగళవారం మయూరి నాట్య కళా సాధన ఆధ్వర్యంలో మువ్వా ధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణపతి పూజ నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజలో భాగంగా ధ్వజారోహణం, కుంకుమార్చన, గణపతి పూజ, పుణ్యాహవచనం, గౌరీ గణపతి హోమం, పూర్ణాహుతి, మృత్యుంజయ హోమం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

దుండిగల్‌: డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయంలో నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ దుండిగల్‌ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుండిగల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డి.పోచంపల్లిలోని డబుల్‌ బెడ్‌రూమ్‌ సముదాయంలోని 3, 5, 8 బ్లాక్‌ల వద్ద ఎంపీ ఈటల రాజేందర్‌ ఆదేశాలతో మూడు బోర్లను కలెక్టర్‌ నుంచి మంజూరు చేయించామని తెలిపారు. వెంటనే వర్క్‌ ఆర్డర్‌ ఇచ్చి బోర్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గణేష్‌, నాగమణి, మధు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్‌ డే



జీడిమెట్ల: ప్రాజెక్ట్‌ బేస్‌డ్‌ ద్వారా చేసే బోధన విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందని టీవీఆర్‌ పాఠశాలల అకాడమిక్‌ డైరెక్టర్‌ టి.వంశీకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అపురూపా కాలనీలోని టీవీఆర్‌ మోడల్‌ స్కూల్‌లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ అందజేశారు. అనంతరం చిన్నారులచే నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ జయరాజ్‌, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కుత్బుల్లాపూర్‌: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో వాహనదారుల, పాదాచారుల దప్పిక తీరుతుందని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం దుండిగల్‌ మున్సిపల్‌ పరిధిలోని బహదూర్‌పల్లిలో కాంగ్రెస్‌ నాయకుడు కృష్ణమూర్తి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ మైసిగారి శ్రీనివాస్‌, రంగయ్య, రాజశేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించాలి

దుండిగల్‌: ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిదారులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌ నాయక్‌ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆస్తి పన్ను వసూళ్ల పని తీరును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ రెవెన్యూ అధికారి జి ప్రభాకర్‌, మేనేజర్‌ బి లక్ష్మయ్య, వార్డు అధికారులు, బిల్‌ కలెక్టర్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్‌

సుభాష్‌నగర్‌: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలో చింతల్‌ హెచ్‌ఎంటీ కాలనీకి చెందిన డ్రైవర్‌ ప్రవీణ్‌కుమార్‌ గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు అక్కడకు చేరుకోగా.. నిందితుడు పారిపోవడానికి యత్నించాడు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు అతడిని పట్టుకుని 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ఇంటి నుండి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

సుభాష్‌నగర్‌: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం కృషి కాలనీకి చెందిన జనార్దన్‌(48), విజయ భార్యాభర్తలు. కూలి పనులు చేసే జనార్దన్‌ సోమవారం ఉదయం 9:40 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని మొబైల్‌కు ప్రయత్నించగా.. స్విచ్ఛాప్‌ వచ్చింది. మంగళవారం అతని భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు అధికారుల చేతుల్లో ‘పుర సేవలు’

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యత అప్పగింత

- పని ఏదైనా వారిదే కీలకం
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర పురపాలక శాఖ
- నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు



సాక్షి, సిటీబ్యూరో: పురపాలిక సంఘాల్లోని వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. జనన, మరణ ధ్రువపత్రాల పరిశీలన బాధ్యతలను వారికి అప్పగిస్తూ ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో ఏ పనుల్లోనూ వార్డు అధికారుల ప్రమేయం అంతగా ఉండటం లేదు. ఇక నుంచి ఏ పని చేసినా వారి పాత్ర కీలకం కానుంది.

ధ్రువపత్రాల జారీలో..

పురపాలక సంఘాల నుంచి ధ్రువ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన దుస్థితి నెలకొంటోంది. సాధారణంగానే పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికి తోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, ఇటీవల అవుటర్‌ రింగ్‌ రోడ్‌ పరిధిలో ఉన్న 40 గ్రామ పంచాయతీలు సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనమయ్యాయి. ఒక్క మేడ్చల్‌ –మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల పరిధిలో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. బర్త్‌, డెత్‌, మ్యారేజ్‌ సర్టిఫికెట్లు(ధ్రువీకరణ పత్రాలు)తో సహా ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యుటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పాట్లు పడాల్సి వస్తోంది.

మిగతా వాటిల్లోనూ అంతే..

పురపాలక సంఘాల్లో చెత్తా చెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలు కూడా ప్రజలను వెక్కిరిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్ల పొదలు, పేరుకుపోతున్న చెత్తా చెదారంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పన్నుల వసూళ్లతో సహా వాణిజ్య వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి పన్ను మదింపు(ఖరారు)లోనూ ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణాల అనుమతుల విషయంలోనూ తీవ్ర జాప్యమే కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో ఈ వ్యవహారంపై రాష్ట్ర పురపాలక శాఖకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే పత్రాలు జారీ చేయడం ఏమిటని రాష్ట్ర పురపాలకశాఖ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత బాధ్యతలను వార్డు అధికారులకు అప్పగిస్తూ పరిశీలన చేపట్టి తప్పులు లేకుండా పత్రాలు జారీ చేయాలని సూచిస్తోంది. పట్టణాల్లో నేరుగా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని ధ్రువపత్రాన్ని తీసుకుంటున్నారు. పురపాలికల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన పెరగాలన్న ఉద్దేశంతో వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి వెంటనే జనన, మరణ ధ్రువపత్రాలు అందనున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని పురపాలక సంఘాల కమిషనర్లు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌



కుత్బుల్లాపూర్‌: తెలంగాణ బడ్జెట్‌ సమావేశాల్లో మంగళవారం జరిగిన చర్చలో బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ కుత్బుల్లాపూర్‌ లో డిగ్రీ కళాశాలకు స్థల కేటాయింపు, నిర్మాణ విషయంపై మాట్లాడారు. 2023లో మాజీ సీఎం కేసీఆర్‌ కుత్బుల్లాపూర్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేశారని, అయితే ప్రభుత్వ స్థలం కేటాయించకపోవడంతో బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ ప్రాంగణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో ఇటు డిగ్రీ, అటు ఇంటర్‌ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం వెంటనే హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 110 ఎకరాలలోని హెచ్‌ఎంటీ స్థలంలో ఐదు ఎకరాలను డిగ్రీ కళాశాలకు కేటాయించి కళాశాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణం

దుండిగల్‌: సిమెంట్‌ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ 5 స్టార్‌ గ్రేడ్‌ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్‌ ఇంజినీర్‌ శివకుమార్‌ అన్నారు. మంగళవారం బౌరంపేట్‌లోని లక్ష్మీనరసింహ ట్రేడర్స్‌ డీలర్‌ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్‌ కాంక్రిట్‌ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్‌ ఇంజినీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయపడతారని అన్నారు.



బహుమతులు అందజేస్తున్న టెక్నికల్‌ ఇంజినీర్‌ శివకుమార్‌

డీలర్‌ జీవన్‌ రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్‌ సర్వీస్‌ చాల ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ మార్కెటింగ్‌ రాజేంద్ర ప్రసాద్‌, 20 మంది మేస్త్రీలు పాల్గొన్నారు.

ఫిల్లింగ్‌ పాయింట్లను పరిశీలించిన జీఎం



వివరాలు తెలుసుకుంటున్న జీఎం అశోక్‌

చింతల్‌: నూతన ఫిల్లింగ్‌ పాయింట్లను ఏర్పాటు చేయడం ద్వారా వాటర్‌ ట్యాంకర్ల వెయిటింగ్‌ లిస్టు తగ్గుముఖం పట్టిందని కుత్బుల్లాపూర్‌ వాటర్‌ వర్క్స్‌ జీఎం అశోక్‌ అన్నారు. గతంలో జీడిమెట్లలో మాత్రమే మూడు ఫిల్లింగ్‌ పాయింట్లు ఉండగా క్రమక్రమంగా షాపూర్‌నగర్‌లో రెండు పాయింట్లు, గాజులరామారం కైసర్‌నగర్‌లోని రిజర్వాయర్‌ వద్ద మరో పాయింట్‌, అదే విధంగా జగద్గిరిగుట్టలోని రిజర్వాయర్‌ వద్ద మరో పాయింట్‌ను ప్రారంభించామని తెలిపారు. మంగళవారం చింతల్‌ సబ్‌డివిజన్‌ జీడిమెట్ల సెక్షన్‌ పరిధిలోని వాటర్‌ ట్యాంకర్‌ ఫిల్లింగ్‌ పాయింట్‌ను పరిశీలించి డీజీఎం రాజేష్‌తో కలిసి ట్యాంకర్ల వివరాలు తెలుసుకున్నారు. ట్యాంకర్ల ఫిల్లింగ్‌లో నీటి వృథాను అరికట్టాలని, రిజర్వాయర్‌ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆభరణాలు చోరీ

సుభాష్‌నగర్‌: తాళం వేసిన ఇంట్లో బంగారం, వెండితో పాటు నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూరారంలోని దీక్ష స్కూల్‌ సమీపంలోని కార్తీక్‌ నేచర్‌ స్పేస్‌లో నివాసముండే విఠల్‌ కుటుంబం ఈ నెల 22న బీదర్‌లోని తమ బంధువుల వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా ఓ దొంగ ఈ నెల 24న తెల్లవారుజామున 2 గంటల సమయంలో ముఖానికి మాస్క్‌, చేతులకు గ్లౌజులు ధరించి తాళం పగలగొట్టి చోరీ చేశాడు. ఇంట్లో ఉన్న బీరువా పగులగొట్టి 2 తులాల బంగారం, 30 తులాలు వెండి, రూ.50 వేల నగదు అపహరించారు. మంగళవారం మధ్యాహ్నం విఠల్‌ కుటుంబం ఇంటికి రాగా.. తాళం పగలగొట్టి ఉండటంతో బీరువా చూసి చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీరువా పగులగొట్టిన దృశ్యం

ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన వృద్ధుడు

పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు



సోమరాజు(ఫైల్‌)

సుభాష్‌నగర్‌: ఇంట్లో చెప్పాపెట్టకుండా ఓ వృద్ధుడు వెళ్లిపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం రాజీవ్‌ గృహకల్పలో నివాసముండే సోమరాజు(80) మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులతో చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుమారుడు గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెజిస్ట్రేట్‌గా నిందితులను విచారించిన డీసీపీ



కుత్బుల్లాపూర్‌: స్పెషల్‌ మెజిస్ట్రేట్‌ పవర్‌ను మొట్ట మొదటిసారిగా మేడ్చల్‌ డీసీపీ కోటిరెడ్డి వినియోగించుకున్నారు. గతంలో తహసీల్దార్‌కు ఈ పవర్‌ ఉండగా.. ఇటీవల డీసీపీలకు సైతం మెజిస్ట్రేట్‌ పవర్‌ ఇవ్వడంతో పేట్‌ బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పైన ఉన్న కార్యాలయంలో మంగళవారం దుండిగల్‌, అల్వాల్‌ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో దొంగతనం చేసి నిందితులుగా ఉన్న వారిని విచారించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని వారికి సూచించారు. సీఐలు సతీష్‌, రాహుల్‌ దేవ్‌ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

సుభాష్‌నగర్‌: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం సాయిబాబానగర్‌కు చెందిన జాదవ్‌ బాయమ్మ మనువడు చరణ్‌ (06) ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి గ్రే కలర్‌ షర్టు, బ్లాక్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించాడని, గుజరాతీ, మరాఠీ, హిందీ అర్థమవుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

30న రామ్‌లీలా మైదానంలో ఉగాది ఉత్సవాలు

సుభాష్‌నగర్‌: శ్రీ విశ్వవసు నామ ఉగాది ఉత్సవాలను ఈ నెల 30న సూరారం రామ్‌లీలా మైదానంలో నిర్వహిస్తున్నట్లు శ్రీరామ్‌లీలా ఉత్సవ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యోగేష్‌ ప్రభు స్వామీజీ ప్రసంగం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్ల అవుట్‌!

- అవినీతిపై విజిలెన్స్‌ అధికారుల నివేదిక
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్‌ : జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తి ఇటీవలే ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్లపై తీసుకున్న నిర్ణయం హాట్‌ టాపిక్‌గా మారింది. మొత్తం గ్రేటర్‌ పరిధిలో 27 మంది న్యాక్‌ ఇంజినీర్లను తొలగిస్తున్నట్లు ఈ నెల 23వ తేదీన కమిషనర్‌ ఆదేశాలు జారీ చేశారు. జంట సర్కిళ్లు కుత్బుల్లాపూర్‌, గాజులరామారం పరిధిలో టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో పని చేస్తున్న ఐదుగురు ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్లపై వేటు వేశారు. కొన్ని నెలలుగా వీరిపై ప్రత్యేకంగా దృష్టి సారించిన గ్రేటర్‌ కమిషనర్‌ విజిలెన్స్‌ ఎంక్వైరీ చేయించి చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. జంట సర్కిళ్ల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా తమ జేబులు నింపుకుంటున్నట్లు వీరిపై ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో నిర్మాణదారుల నుంచి రూ.50 వేల నుంచి లక్ష వరకు తీసుకున్నట్లు తెలిసింది.

ప్రజావాణి ఫిర్యాదులే కాసులు కురిపించాయి..

ప్రతి సోమవారం సర్కిల్‌ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు పంపిస్తారు. ఇదే అదునుగా భావించి టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్లు అందిన కాడికి దండుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలో సుభాష్‌ నగర్‌ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ షెడ్లు ఏర్పాటు చేస్తున్నా అక్కడ పనిచేస్తున్న ఇంజినీర్‌ జయశ్రీ, జీడిమెట్ల డివిజన్‌ పరిధిలో ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్‌ వెంకటేష్‌ సైతం అక్రమ నిర్మాణదారులకు అండగా ఉంటున్నారని విజిలెన్స్‌ అధికారులు గుర్తించారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్‌ పరిధిలో నల్ల జస్వంత్‌, వ్యనల సాయిరాం, గుగులావత్‌ పున్నం చంద్‌పై కూడా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని విజిలెన్స్‌ నివేదిక ఇవ్వడంతో గ్రేటర్‌ కమిషనర్‌ వీరిని విధుల నుండి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.



కుత్బుల్లాపూర్‌, గాజులరామారం సర్కిల్‌ కార్యాలయం

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేది?

జంట సర్కిళ్ల పరిధిలో ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కట్టడి చేయాల్సిన వారు కరువయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారులకు డిప్యుటేషన్‌ పై ఇతర సర్కిల్‌ బాధ్యతలు కూడా అప్పగించారు. రెండు ప్రాంతాల్లో దృష్టి సారించే లేక చేతులెత్తేస్తున్నారు అన్నది ప్రధాన చర్చ. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమైన సంబంధిత టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు.. తాజాగా జరిగే నిర్మాణాలపై ఏ విధంగా దృష్టి సారిస్తారు అన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా ఔట్‌ సోర్సింగ్‌ న్యాక్‌ ఇంజినీర్లపై తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్‌ వైద్యం

కుత్బుల్లాపూర్‌: నిరుపేదలు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా కార్పొరేట్‌ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఒరిగంటి వెంకటరమరాజుకు రూ.60 వేలు, జి. లక్ష్మమ్మకు రూ. 35 వేల చెక్కులను షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌

సీఈఐఆర్‌ ద్వారా 126 సెల్‌ఫోన్‌ల రికవరీ



సెల్‌ఫోన్‌లు అందుకున్న వారితో పోలీసులు

జీడిమెట్ల: ఎనిమిది పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న 126 మంది బాధితులకు బాలానగర్‌ డీసీపీ ఏ సురేష్‌కుమార్‌ రికవరీ చేసి వారికి అందజేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు రూ.28 లక్షల విలువచేసే ఫోన్‌లను అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్‌ పోగొట్టుకుంటే వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు. కేపీహెచ్‌బీ- 35, జీడిమెట్ల- 23, బాచుపల్లి- 18, సనత్‌నగర్‌–17, కూకట్‌పల్లి- 14, అల్లాపూర్‌- 9, జగద్గిరిగుట్ట- 7, బాలానగర్‌ పరిధిలోని ముగ్గురికి అందజేశారు. సమావేశంలో బాలానగర్‌ ఏసీపీ హన్మంత్‌ రావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐలు నర్సింహరాజు, కనకయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

‘సఖి’ ద్వారా మహిళలకు ఉచిత సేవలు

సుభాష్‌నగర్‌: సూరారం వెంకటరమణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సఖి టీమ్‌ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, వరకట్నం వేధింపులు, ఇతర సమస్యలపై అవగాహన కల్పిస్తూ బాధితులు ఎవరైన ఉంటే 181 హెల్ప్‌లైన్‌ నెంబరుకు కాల్‌ చేసి సహాయం పొందవచ్చన్నారు. సఖిలో బాధిత మహిళలకు న్యాయ సహాయం, మెడికల్‌ అండ్‌ షెల్టర్‌, కౌన్సిలింగ్‌ వంటి సేవలు ఉచితంగా లభిస్తాయన్నారు. అదే విధంగా సైబర్‌ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఏడబ్ల్యూబ్ల్యూ కార్యకర్త శోభ, లావణ్య, పారామెడికల్‌ అక్షయ, ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పోలీస్‌ పెట్రోలింగ్‌ వాహనం ఇంజన్‌లో మంటలు



జీడిమెట్ల: పోలీసు పెట్రోలింగ్‌ వాహనం ఇంజన్‌లో విద్యుదాఘాతంతో మంటలు అంటుకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల పెట్రోలింగ్‌కు చెందిన ఇన్నోవా వాహనం మంగళవారం రాత్రి గాజులరామారంలోని సీఎంఆర్‌ స్కూల్‌ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఒక్కసారిగా ఇంజన్‌ నుండి మంటలు రావడంతో అప్రమత్తమైన పోలీసులు కిందకు దిగి ఇంజన్‌ ఆపివేసి స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు. సంఘటనా స్థలానికి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ గడ్డం మల్లేష్‌ చేరుకుని ప్రమాదతీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసులు అప్రమత్తం కావడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

రూ.9,885 ఫైన్‌ చెల్లించిన ద్విచక్రవాహనదారుడు

సుభాష్‌నగర్‌: ట్రాఫిక్‌ నిబంధనలను అతిక్రమిస్తూ చలాన్‌లు చెల్లించకుండా తిరుగుతున్న వ్యక్తి నుంచి జీడిమెట్ల ట్రాఫిక్‌ పోలీసులు రూ.9,885 నగదును చలాన్‌ రూపేణా వసూలు చేశారు. మంగళవారం సూరారం చౌరస్తాలో జీడిమెట్ల ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ క్రమంలో హెల్మెట్‌ ధరించకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న సూరారం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన వెంకట రఘు పట్టుబడ్డాడు. సదరు బైక్‌ నెంబర్‌ (టీఎస్‌ 08ఎఫ్‌క్యూ 0030)పై ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా.. అతను 61 సార్లు ట్రాఫిక్‌ ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలింది. ఇందులో 51 సార్లు హెల్మెట్‌ ధరించకుండా డ్రైవ్‌ చేయగా, మరో 10 సార్లు ట్రిబుల్‌ డ్రైవింగ్‌, రాంగ్‌రూట్‌లలో వాహనం నడిపినట్లు గుర్తించారు. సీఐ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సదరు యువకుడికి కౌన్సిలింగ్‌ ఇచ్చి సదరు మొత్తాన్ని ఫైన్‌ రూపంలో వసూలు చేశారు.

